## రామోజు శివకుమార్‌కు అవార్డు



ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్‌ సెంటర్‌ 9వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లికి చెందిన రామోజు శివకుమార్‌ విశ్వకర్మ యంగ్‌లీడర్‌ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఏసీబీ క్రైం కుమ్మర పల్లి కిరణ్‌కుమార్‌, సంస్థ తెలంగాణ అధ్యక్షుడు ఆకారపు శ్రీనివాస్‌, పుష్పగిరి, తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్‌ చారి పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కృష్ణ



బాలానగర్‌: మేడ్చల్‌–మల్కాజ్‌గిరి జిల్లా సీపీఐ జిల్లా 4వ మహా సభలను ఈసీఐఎల్‌, బంజారా ఫంక్షన్‌ హాల్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జి. కృష్ణను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం, సాయిలు గౌడ్‌, వీఎస్‌. బోస్‌, ఉమామహేశ్‌కు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన వారికి రేషన్‌ కార్డులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## చిత్తారమ్మ ఆలయంలో ఉపనయనం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి చిత్తారమ్మ ఆలయంలో శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్‌ ఆధ్వర్యంలో సామూహిక ముంజ్‌ (ఉపనయనం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 7 నుంచి 16 ఏళ్ల వయస్సు గల 55 మంది పిల్లలు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో హనుమంత్‌రావు, మాణిక్‌ పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

బాలానగర్‌: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బాలనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ టి నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం.. ధన్‌రాజ్‌ కుటుంబ సభ్యులతో కలిసి వినాయకనగర్‌ లో నివసిస్తున్నాడు. తన ఆర్థిక అవసరాల కోసం పలు బ్యాంకుల్లో లోన్లు తీసుకున్నాడు. ఈనెల వాయిదా చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు పలుమార్లు ఫోన్‌ చేశారు. దాంతో ధన్‌రాజు (37) ఈనెల 18న రాత్రి 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులు ఇండ్లలో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఫోను కూడా స్విచ్ఛాఫ్‌ చేసి ఉంది. దీంతో ఆందోళనకు గురైన ధన్‌రాజు తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## ఫతేనగర్‌ ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి నిర్మించరూ..!

బాలానగర్‌: ఫతేనగర్‌ ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరుకువంతెనతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రైల్వే అనుమతుల కోసం ఫీజు చెల్లించి అనుమతులు కూడా పొందిన తర్వాత పనులు చేపట్టలేదు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో కార్పొరేటర్‌ పండాల సతీశ్‌గౌడ్‌ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని కమిషనర్‌, మేయర్‌కు వినతిపత్రాలు అందించినా కదలిక రాలేదు. అయితే శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి మెట్లను ఎక్కి పైకి వెళ్లాలనుకున్న ఓ వ్యక్తి అతని స్నేహితుడు మెట్లు విరిగి పడిపోయాడు. దాంతో వారిలో ఒకరి కాలుకు గాయమైంది. ఇకనైనా స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.



మెట్లు ఎక్కే క్రమంలో గాయపడిన వ్యక్తి





# ఇష్టారాజ్యంగా..

- రోడ్లకిరువైపులా వాహనాల పార్కింగ్‌
- రోజుల తరబడి అక్కడే ఉంటున్న వైనం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టని అధికారులు

మోతీనగర్‌: అల్లాపూర్‌, మూసాపేట డివిజన్లలో రోడ్లకిరువైపులా ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్‌ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అల్లాపూర్‌ డివిజన్‌లోని బ్యాంక్‌ కాలనీలో రోడ్లపైనే భారీ వాహనాలు నిలుపుతుండడంతో నిత్యం ట్రాఫిక్‌ జాం ఏర్పడుతోంది. మూసాపేట డివిజన్‌లోని పాండురంగనగర్‌, అవంతినగర్‌ ఈస్ట్‌కాలనీ, అవంతినగర్‌ తోట, మోతీనగర్‌, కబీర్‌నగర్‌లో ఇళ్ల మధ్యే రోడ్లపైన ఎక్కడికక్కడే కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్‌ చేస్తూ రోజులు తరబడి వదిలేసి వెళ్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హైటెక్‌ సిటీకి దగ్గర దారి కావడంతో రాత్రి, పగలు తేడా లేకుండా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్లపై నిలుపుతున్న వాహనాలతో సరైన సమయానికి విధులకు వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పార్కింగ్‌ చేసే వాహనాలను స్టేషన్‌కు తరలించే పోలీసులు గల్లీల్లో నెలల తరబడి పార్కింగ్‌ చేసినా ఎందుకు తొలగించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు సమీప కాలనీవాసులు సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.ఆ ప్రాంతం మాదాపూర్‌, బాలానగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వస్తుండడంతో తమ పరిధి కాదంటే తమది కాదని ఒకరినొకరు సమస్యను పట్టించుకోవడం లేదు. ప్రతిరోజు ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తే కొంతమేరకైనా సమస్య తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మోతీనగర్‌లోని పలు వీధుల్లో నిలిపిన ద్విచక్ర వాహనాలు, కార్లు

### రోడ్లపైనే నిలుపుతున్నారు..



నేను ప్రతిరోజు హైటెక్‌ సిటీకి వెళ్తాను. బ్యాంకుకాలనీ మీదుగా వెళ్లాలంటే వాహనాల పార్కింగ్‌ అడ్డుగా ఉండడంతో రాత్రి వేళలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారులపై వాహనాలు పార్కింగ్‌ చేయకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి.

–వేణుగోపాల్‌ (టింకు), మోతీనగర్‌

## రేపే మోతీనగర్‌ కో–ఆపరేటివ్‌ హౌసింగ్‌ సొసైటీ ఎన్నికలు



మోతీనగర్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ భవనం



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో ప్రసాద్‌ ప్యానెల్‌ బృందం

మోతీనగర్‌: మోతీనగర్‌ కో–ఆపరేటివ్‌ హౌసింగ్‌ సొసైటీ లిమిటెడ్‌ ఎన్నికలు ఈనెల 27న (రేపు) జరగనున్నాయి. ఇప్పటికే అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. సుమారు 70 ఏళ్ల క్రితం సుమారు ఎకరా స్థలంలో సామాజిక భవనం, షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మించారు. ప్రస్తుతం 40 షట్టర్లు, ఫంక్షహాల్‌ నిర్మించారు. సనత్‌నగర్‌ కోఆపరేటివ్‌ లిమిటెడ్‌గా ఏర్పాటు చేశారు. కాలక్రమేనా మోతీనగర్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ లిమిటెడ్‌గా పేరు మార్చారు. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి సొసైటీకి ఎన్నికలు జరగడం సర్వసాధారణం. రెండు ప్యానల్స్‌ బరిలో ఉన్నాయి. ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించి అదేరోజు కౌంటింగ్‌ లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. మొత్తం 407 ఓట్లు ఉన్నాయి. మొత్తం 28 మంది నామినేషన్‌ వేయగా ముగ్గురు పోటీ నుంచి తప్పుకోగా 25 మంది బరిలో ఉన్నారు. ప్రస్తుతం అంజిరెడ్డి ప్యానల్‌, వి. ప్రసాద్‌ ప్యానల్‌ అదేవిధంగా పలువురు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన సభ్యులు

డాక్టర్‌ ఎస్‌.వి. ప్రసాద్‌ ఆధ్వర్యంలో డెవలప్‌మెంట్‌ ప్యానల్‌ సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి సొసైటీ ఎన్నికల మ్యానిఫెస్టోను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి మీరు అడిగిన అభివృద్ధి పనులు చేసిపెడతానని హామీనిచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపీ రమేశ్‌ తదితరులు

## ఉత్సవాల పోస్టర్‌ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర నూకాంబిక అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను హైదరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో ఎంపీ సీఎం.రమేశ్‌ సోమవారం ఆవిష్కరించారు. జూన్‌ 15న కూకట్‌పల్లి అయ్యప్ప స్వామి, చిత్తారమ్మ అమ్మవారి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా అనకాపల్లి ఎంపీ డాక్టర్‌ సీఎం రమేశ్‌, గౌరవ అతిథిగా దాడి రత్నాకర్‌ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్రి కిశోర్‌ కుమార్‌ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జంట నగరాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకొని కృపాకటాక్షాలను, ఆశీర్వాదాలను పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు సూచించారు.

## ఓపెన్‌ నాలా పూడికతీత పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్‌ నుంచి గురుగోవింద్‌సింగ్‌కాలనీ వరకు ఓపెన్‌నాలా పూడికతీత పనులను కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేశ్‌గౌడ్‌, ఏఈ శ్రావణితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనులు సకాలంలో పూర్తి చేసి కాలనీ ముంపునకు గురికాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్‌, ముజీబ్‌, రాజుగౌడ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ వెంకటేశ్‌గౌడ్‌, ఏఈ శ్రావణి

## ఏసీపీలను కలిసిన నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రవికిరణ్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌ రెడ్డి, కేపీహెచ్‌బీ డివిజన్‌ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఫణీంద్ర, మేకల మేకేల్‌, రేష్మా, దేవ సహాయం, రవి, శేషగిరినాయుడు, రాజు ముదిరాజ్‌, రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌, కొమ్ముబాబు తదితరులు పాల్గొన్నారు.

**బాలానగర్‌ ఏసీపీని..**

బాలానగర్‌: బాలానగర్‌ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేశ్‌ రెడ్డిని జీహెచ్‌ఎంసీ మాజీ కార్పొరేటర్‌ కాండూరి నరేంద్రాచార్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ ఎండీ నసీర్‌, ఎన్‌. లచ్చాగౌడ్‌, టి. రవీందర్‌, ఎండగి అఫ్జల్‌, ఎంగగి సలావుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి: బాలానగర్‌ మండల కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, ముద్దం నరసింహయాదవ్‌, ఆవుల రవీందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అన్నప్రసాద వితరణ

మోతీనగర్‌: జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న మధ్యాహ్నం 12 గంటలకు అమావాస్య అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మోతీనగర్‌ చౌరస్తాలోని సంతోష్‌ నిలయం వద్ద అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

## జోనల్‌, డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ఇంటి పన్ను విషయంలో ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్న ట్యాక్స్‌ కలెక్టర్‌, బిల్‌ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవడంత పాటు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కాంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ ఎనుగుల తిరుపతి నాయకులతో కలిసి కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌, డిప్యూటి కమిషనర్‌ గంగధర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లో పని చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాగే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని వీధిదీపాలు వెలగడం లేదని తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు.



డిప్యూటీ కమిషనర్‌ గంగధర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎనుగుల తిరుపతి తదితరులు

## రోడ్డుపై ఆయిల్‌ లీక్‌..వాహనదారుల అవస్థలు



ఆయిల్‌ లీక్‌ అయిన చోట ట్రాఫిక్‌ పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ: వాహనంలో తరలిస్తున్న గుర్తు తెలియని ఆయిల్‌ రోడ్డుపై లీక్‌ అవడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడిన ఘటన కేపీహెచ్‌బీ ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగింది. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ ఎదుట పాదాచారులు రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన సిగ్నల్‌ వద్ద నిలిచిన ఓ వాహనం నుంచి ఆయిల్‌ లీక్‌ అయి కొద్ది దూరం వరకు పారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఒక్కసారిగా జారిపడిపోయారు. విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ జానయ్య ఆధ్వర్యంలో చిప్స్‌ పొడర్‌ తెప్పించి ఆయిల్‌ ఉన్న ప్రాంతంలో చల్లడంతో పాటు కొద్దిసేపటి వరకు వాహనాలను అటు వైపుగా వెళ్లకుండా నియంత్రించారు. సుమారు గంట తర్వాత యధావిధిగా వాహనాలను అనుమతించారు.

## ప్రజావాణిలో 22 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌, అధికారులు



పార్కు నిర్మించాలని ఫిర్యాదు చేసిన చిన్నారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రాలు అందజేశారు. మొత్తం 21 ఫిర్యాదులు రాగా అందులో టౌన్‌ప్లానింగ్‌ 9, ఇంజినీరింగ్‌ 6, ట్యాక్సేషన్‌ 3, యూబీడీ 1, ఎలక్ట్రికల్‌ 1, హెల్త్‌, శానిటేషన్‌కు సంబంధించి 1 ఫిర్యాదు వచ్చిందని ఆయన తెలిపారు.

**చిన్నారుల ఫిర్యాదు**

కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఇద్దరు చిన్నారులు ఫిర్యాదు చేశారు. మూసాపేటలో పిల్లలు ఆడుకునేందుకు పార్కు లేదని, అలాగే ఆంజనేయనగర్‌లోని పార్కు స్థలాన్ని గతంలో కొందరు కబ్జా చేశారని, అధికారులు, పోలీసులు ఆ పార్కు స్థలాన్ని కాపాడారని తెలిపారు. ఆ స్థలంలో పార్కు డెవలప్‌ చేసేందుకు గతంలో రూ. 50 లక్షలు కేటాయించారని అయితే డబ్బులు రిలీజ్‌ చేయకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తే పార్కు నిర్మాణం పూర్తవుతుందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## శెట్టిబలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న నాయకులు

కూకట్‌పల్లి: శెట్టిబలిజ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్‌ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఓ హోటల్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీసీ కమిషన్‌ తొలగించిన 26+1 కులాల కోసం నోటిఫికేషన్‌ జారీ చేయగా దానికి సంబంధించి బీసీ కమిషన్‌కు శెట్టిబలిజ కమ్యూనిటీ గురించి సబ్‌మిట్‌ చేయాల్సిన అఫిడవిట్‌, పత్రాలు ఎలా.. ఏ ఫార్మేట్‌లో అందించాలి..ఎలాంటి సర్టిఫికెట్స్‌, తీసివేసిన కులాల గురించి ఆధారాలు ఏం ఇవ్వాలి.. సలహాలు, సూచనలు తీసుకునేందుకు ప్రభుత్వంలో అధికారులుగా పనిచేసిన కొంతమంది న్యాయ నిపుణులతో సంప్రదించాలని నిర్ణయించారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సరైన విధానం పాటించకుండా, సరైన సమాచారం లేకుండా ఈ కులాలను తొలగించడం చాలా బాధాకరమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలుగా ఉన్న ఈ కులాలను తిరిగి బీసీలో చేరుస్తామని కాంగ్రెస్‌ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాన్ని నిలబెట్టుకోవాలని సీఎంకు విన్నవించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కెవి. రావు, ఉపాధ్యక్షులు డివివి సత్యనారాయణ, మామిడిశెట్టి నాగేంద్ర, ట్రెజరర్‌ పి. గోపాలాకృష్ణ, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ చింతపల్లి వెంకటేశ్వరరావు, విత్తనాల భాస్కరరావు, ఆర్గనైజింగ్‌ సెక్రటరి గుబ్బల లక్ష్మీనారాయణ, కల్చరల్‌ సెక్రటరీ దొమ్మేటి సతీశ్‌, శీలం శ్రీనివాస్‌, అడ్వయిజర్స్‌ వాసంశెట్టి రాజాబాబు, వాసంశెట్టి మూర్తి, సంఘ పెద్దలు వాసంశెట్టి రాధాకృష్ణ, పితాని శేఖర్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లిలో తిరంగా యాత్ర



యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకుడు రాజేశ్వర్‌రావు తదితరులు

కూకట్‌పల్లి: 'ఆపరేషన్‌ సిందూర్‌' విజయవంతంగా ముగియడంతో సోమవారం రాత్రి మూసాపేట్‌ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు పాల్గొని జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కన్వీనర్‌ ఎస్‌ మల్లారెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్శనపల్లి సూర్యారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, జిల్లా కార్యదర్శి విజయ భవానీ, మూసాపేట్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కొడిచేర్ల మహేందర్‌, నియోజకవర్గ బీజేపీ, వివిధ ప్రజా సంఘల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో కేటీఆర్‌



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, శైలజారావు కుమారుడు శివ అభిషేక్‌ రావు, దివ్య వివాహ రిసెప్షన్‌ సోమవారం జరిగింది. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు, నవీన్‌కుమార్‌, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్‌, జగన్‌, మంత్రి సత్యనారాయణ, బీజేపీ నాయకులు మాధవరం కాంతారావు, కార్పొరేటర్‌ కోడిచెర్ల మహేందర్‌, నాయకులు ఎర్రబెల్లి సతీశ్‌రావు, మహమ్మద్‌ గౌసుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం




సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: బాగ్‌అమీర్‌లోని రామకృష్ణ స్కూల్‌ 1999–2000 బ్యాచ్‌ పూర్వ విద్యార్థుల సిల్వర్‌ జూబ్లీ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాక్షేమాలు అడిగి తెలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే అప్పటి ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462